రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్
వార్త

## దేవుడి విగ్రహాన్ని ఎత్తుకెళ్లిన దొంగలు

**తాండూరు, జూలై 1, ప్రభాతవార్త :**
సమాజంలో దేవుడి విగ్రహాలకుభద్రత కరువైంది. వికారాబాద్ జిల్లా తాండూరు మండల పరిధిలోని జినగుర్తి గ్రామంలో దేవుడి విగ్రహాన్ని గుర్తుతెలియని వ్యక్తులు అపహరించారు. గత నెలన్నర క్రితం జినగుర్తి గ్రామ గేట్ సమీపంలోని దత్తాత్రేయ స్వామి విగ్రహాన్న గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. తాజాగా అదే గ్రామంలోని రామలింగేశ్వర స్వామి దేవాలయంలో భవానీ మాత విగ్రహం చోరీకి గురైంది. ఈ సంఘటన శనివారం ఉదయం వెలుగులోకి వచ్చింది. ఆలయ అర్చకులు శివకుమార్ ఉదయం ఆలయాన్ని తెరచి చూడగా శివలింగం వద్ద ఉన్న భవానీ మాత విగ్రహం కనిపించలేదు. దీంతో ఆలయ పూజారీ వెంటనే గ్రామస్తులకు సమాచారం అందించారు. ఆలయ చైర్మన్ ప్రవీణ్‌గౌడ్ కరణ్‌కోట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే, వరుసగా గ్రామంలో దేవుళ్ల విగ్రహాలు చోరికి గురికావడం తీవ్ర కలకలం రేపుతుంది.త

## కిషోర బాలికలకు వృత్తి కోర్సుల్లో శిక్షణ

**మొయినాబాద్, జూలై 1 ప్రభాతవార్త:** రంగారెడ్డి జిల్లాకు చెందిన 15 నుంచి 18 సంవత్సరాల వయస్సు ఉన్న కిషోర బాలికలకు చిలుకూరులో ఉన్న దుర్గాబాయి మహిళా శిశు వికాస కేంద్రంలో పలు వృత్తి విద్యా కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా అధికారిణి శైలజకుమారి ఒక ప్రకటనలో తెలిపారు. బ్యూటీషియన్, టైలరింగ్, ఎంబ్రాయిడరింగ్, మగ్గం వర్క్ వంటి వృత్తి కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నట్లు వివరించారు. ఆసక్తి ఉన్న వారు ఈ నెల 5వ తేదీ నాటికి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. రెండు నెలల బ్యూటీషియన్, మూడు నెలల ఎంబ్రాయిడరింగ్, రెండు నెలల మగ్గం వర్క్‌లలో శిక్షణలో చేరాలంటే వారు 7వ తరగతి పాస్ లేదా ఫెయిల్ అయి ఉండాలి. ఈ శిక్షణ ఇచ్చే కోర్సుల్లో ఒక్కొక్కటి 25 సీట్ల చొప్పున ఉంటాయని తెలిపారు. 15 నుంచి 18 సంవత్సరాల వయస్సు ఉన్న బాలికలు తమ ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, రెండు పాస్‌పోర్టు ఫోటోలు, జిరాక్స్ కాపీలు తీసుకుని జూలై 5వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు తమ కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు. శిక్షణ ఆహ్లాదకరమైన వాతావరణంలో జరుగుతుందని అన్నారు.

## రేవంత్‌రెడ్డికి దమ్ముంటే నాపై పోటీ చేసి గెలుపొందాలి

**-మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డి మద్దతు లేకుండా గెలిచే సత్తా లేదా?**
**-కొడంగల్‌లో ఓడిపోతే రాజకీయ సన్యాసం తీసుకుంటానని మాట తప్పిన రేవంత్‌రెడ్డి**
**-కొడంగల్‌లో తిరిగి గెలిచేది నేనే**
**-ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి**



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పి.నరేందర్‌రెడ్డి

**కొడంగల్ రూరల్, జులై 1 ( ప్రభాతవార్త):**
రేవంత్‌రెడ్డికి దమ్ముంటే తనపై పోటీ చేసి గెలుపొందాలని, స్థానిక మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డి మద్దతు లేకుండా గెలిచే సత్తా లేదా అని కొడంగల్ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి అన్నారు. శనివారం కొడంగల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తెలంగాణలో అమలు అవుతున్న సంక్షేమ పథకాలను కాంగ్రెస్ పాలిత కర్నాటక రాష్ట్రంలో అమలు చేయించాలన్నారు. గతంలో 50 ఏండ్లు పాలించిన కాంగ్రెస్ పార్టీకి అప్పుడు ఎందుకు సోయి లేదని ప్రశ్నించారు. శుక్రవారం ఖమ్మంలో రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ రైతులకు ఎకరాకు రూ.15వేలు, ప్రతీ కుటుంబానికి రూ.5లక్షలు ఇస్తామని మభ్యపెట్టే మాటలు మాట్లాడారని ఆరోపించారు. రేవంత్‌రెడ్డికి అంత దమ్ముంటే కర్నాటకలో కాంగ్రెస్ అధికారంలో ఉంది కదా అక్కడ తెలంగాణలో అమలు అవుతున్న రైతు బంధు, రైతు బీమా, కళ్యాణలక్ష్మీ, షాదీముబారక్, మిషన్ భగీరథ తాగునీరు, ఆసరా పింఛన్ తదితర సంక్షేమ పథకాలను అమలు చేయించాలన్నారు. కొడంగల్‌లో ఓడిపోతే రాజకీయ సన్యాసం తీసుకుంటానని రేవంత్‌రెడ్డి మల్కాజ్‌గిరిలో ప్రజలకు పంగ నామాలు పెట్టారని విమర్శించారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి పట్టుమని 10 నుంచి 12 సీట్లు వచ్చినా కష్టమే అన్నారు. మొదట రేవంత్‌రెడ్డి ఎక్కడి నుంచి పోటీ చేస్తావో స్పష్టం చేసుకోవాలన్నారు. చిల్లర మల్లర మాటలు మాట్లాడితే ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. తెలంగాణలో ఎక్కడి నుంచి పోటీ చేసినా ఓడించడం ఖాయం అన్నారు. సమావేశంలో కౌన్సిలర్ మధుసూదన్‌యాదవ్, వివిధ గ్రామాల సర్పంచ్‌లు సయ్యద్ అంజద్, పకీరప్ప, గోవిందు, వెంకట్‌రెడ్డి, శంకర్‌నాయక్, బీఆర్ఎస్ నాయకులు టి.సాయిలు, కాశప్ప, జీ.రాంరెడ్డి, రమేశ్‌బాబు, సిద్దులింగప్ప, ఎండీ.సలీం, విష్ణువర్ధన్‌రెడ్డి, విజయ్‌కుమార్, కోట్ల మహిపాల్, నరోత్తంరెడ్డి, ప్రమోద్‌రావు, మడిగే శ్రీను, అంజి, పకీరప్ప, నరేశ్‌గౌడ్, శివకుమార్, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

# ప్రశాంతంగా ముగిసిన గ్రూప్-4 పరీక్ష



శ్రీ సాయి డెంటల్ కళాశాల పరీక్ష కేంద్రాన్ని సందర్శించి పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి

**వికారాబాద్, జులై 01, ప్రభాతవార్త:** గ్రూప్ -4 పరీక్ష శనివారం ప్రశాంతంగా ముగిసింది. అభ్యర్థులు పరీక్ష సమయానికి ముందుగానే పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. ఉదయం, మధ్యాహ్నం పరీక్ష నిర్వహించడంతో, పరీక్ష నిర్వహించారు. పరీక్ష కేంద్రాల వద్ద సంబంధిత అధికారులు తగు ఏర్పాట్లు సైతం చేశారు. మధ్యాహ్న భోజన సమయంలో పట్టణంలోని పలు హోటళ్ళు పరీక్ష అభ్యర్థులతో కిక్కిరిసాయి. మున్సిపల్ పరిధిలోని శ్రీ సాయి డెంటల్ కళాశాల పరీక్ష కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి సందర్శించి పరిశీలించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా గట్టి పోలీసు బందోబస్తును సంబంధిత అధికారులు ఏర్పాటు చేశారు.

### జిల్లాలో గ్రూప్-4 పరీక్ష కేంద్రాలను పరిశీలించిన జిల్లా ఎస్పీ కోట్టిరెడ్డి

జిల్లాలో 67 పరీక్ష కేంద్రాలలో నిర్వహించిన గ్రూప్ -4 పరీక్ష ప్రశాంతమైన వాతావరణంలో ముగియడం జరిగిందని జిల్లా ఎస్పీ కోటిరెడ్డి తెలిపారు. ఉదయం నిర్వహించిన గ్రూప్-4 పరీక్షలో 18118 అభ్యర్థులకు గాను 15735 (86.8537 శాతం) మంది హాజరై అయినారు. మరియు మధ్యాహ్నం నిర్వహించిన గ్రూప్-4 పరీక్షకు మొత్తం 18118 సిబ్బందికి గాను 15711 (86.714 శాతం) మంది హాజరు అయినారని పోలీస్ అధికారులు, సిబ్బంది అందరూ కలసికట్టుగా ఇతర శాఖల అధికారులతో సమన్వయంతో ముందు జాగ్రత్తలు పాటిస్తూ గ్రూప్ -4 పరీక్షలు ప్రశాంతమైన వాతావరణంలో జరిగే విధంగా బందోబస్త్ నిర్వహించారిన గ్రూప్ -4 పరీక్షలు ప్రశాంతంగా ముగిసే విధంగా కృషి చేసిన పోలీస్ అధికారు లకు, సిబ్బందికి, ఇతర శాఖ అధికారులకు ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలుపుతూ జిల్లా అభినందించారు. గ్రూప్ -4 పరీక్షల సందర్భంగా జిల్లా ఎస్పీ వికారాబాద్ పట్టణంలోని మరియు పరిగి పట్టణంలోని పలు పరీక్ష కేంద్రాలను సందర్శించి బందోబస్త్ పరిశీలించారు.



పరీక్ష కేంద్రాలను పరిశీలిస్తున్న ఎస్పీ కోటిరెడ్డి

**మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాలో..**

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి జూలై 1, ప్రభాతవార్త :** మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాలో టిఎస్‌పిఎస్‌సి గ్రూపు-4పరీక్షలు శనివారం ప్రశాంతంగ జరిగాయి. మేడ్చల్-మల్కాజ్‌గిరిలో 187 పరీక్షా కేంద్రాల్లో పరీక్షలు జరిగాయి. పరీక్షలు సజావుగా ప్రశాంతంగ జరిగినట్లు జిల్లా అదనపు కలెక్టర్ పేర్కొన్నారు. అయితే శనివారం ఉదయం పేపర్-1, మధ్యాహ్నం పేపర్-2 పరీక్షలు జరిగాయి. జిల్లా అధికార యంత్రాంగం పరీక్షల నిర్వాహణకు సంబంధించి పకడ్బంధీగ ఏర్పాట్లు చేసింది. జిల్లా వ్యాప్తంగ గ్రూపు-4 పరీక్షలకు 90,220మంది అభ్యర్థులు పరీక్షలు రాయల్సి ఉండగ, వీరిలో 66,638మంది అభ్యర్థులు హాజరై పరీక్షలు రాశారు. ప్రతి పరీక్షా కేంద్రానికి ఒక లజన్ అధికారిని నియమించటం జరిగింది. పరీక్షలు ప్రశాంతంగ జరిగినట్లు లజన్ అధికారులు పేర్కొన్నారు. ఘట్‌కేసర్ మండలంలోని ఎసిఇ ఇంజనీరింగ్ కాలేజి అంకుషాపుర్‌లో ఒక అభ్యర్థి అదనపు గుర్తింపు పత్రం తీసుకరానందున పరీక్షకు అనుమతించలేదని, ఆ కేంద్రం సిఎస్ తెలియజేశారు. ఆ విషయాన్ని ఆయన టిఎస్‌పిఎస్‌సి అధికారులకు నివేధికను పంపనున్నట్లు తెలియజేశారు.

## అల్లూరి సీతారామరాజు జయంతి ఉత్సవాలకు ముమ్మర ఏర్పాట్లు

**- కార్యక్రమానికి హాజరు కానున్న రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము**

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, హైదరాబాద్, జూలై 01, (ప్రభాతవార్త) :**
ఈనెల 4న రంగారెడ్డి జిల్లా గచ్చిబౌలి స్టేడియంలో నిర్వహిస్తున్న అల్లూరి సీతారామరాజు 125వ జయంతి ఉత్సవాల కార్యక్రమమునకు గౌరవ భారత రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము ముఖ్యఅతిథిగా హాజరు అవుతున్న సందర్భంగా శనివారం జిల్లా కలెక్టర్, సైబరాబాద్ పోలీస్ కమీషనర్ స్టీఫెన్ రవీంద్ర, ఇతర అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రాష్ట్రపతి పర్యటన ఏర్పాట్లకు సంబంధించి వివిధ శాఖల అధికారులు సమన్వయంతో విధులు నిర్వహించాలని అన్నారు. రాష్ట్రపతి పర్యటన జరిగే మార్గాలలో రోడ్ల మరమ్మతులు, బారికేడింగ్ చేపట్టాలని కోరారు. పర్యటన సందర్భంగా విస్తృ బందోబస్తు చేపట్టాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. నిరంతర విద్యుత్ సరఫరా, వైద్య బృందాలను నియమించడం, తగు పారిశుద్ధ్య కార్యక్రమాలను చేపట్టాలని సూచించారు. రాష్ట్రపతి పర్యటనలో ఎలాంటి పొరపాటు జరగకుండా, లోపాలు లేకుండా చూడాలని, ప్రోటోకాల్‌ను అనుసరించి ఏవిధమైన లోటుపాట్లు లేకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో రాష్ట్రపతి పర్యటనను విజయవంతం చేయాలని సూచించారు.



కార్యక్రమ ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్, తదితరులు.

## సెల్ ఫోన్‌తో గ్రూప్ 4 పరీక్ష రాస్తూ పట్టుబడ్డ అభ్యర్థి

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, హైదరాబాద్, జూలై 01, (ప్రభాతవార్త) :**
తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమీషన్ ద్వారా శనివారం జరిగిన గ్రూప్ 4 పరీక్ష సందర్భంగా ఓ అభ్యర్థి సెల్ ఫోన్‌తో పట్టుబడ్డాడు. రంగారెడ్డి జిల్లా సరూర్‌నగర్ మండలం మారుతినగర్‌లో సక్సెస్ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రంలో పరీక్ష ప్రారంభమైన అరగంట అనంతరం ఒక అభ్యర్థి సెల్‌ఫోన్‌తో హాజరైనట్లు గమనించిన ఇన్విజిలేటర్ అతని వద్ద గల సెల్‌ఫోన్ సీజ్ చేసి మాల్ ప్రాక్టీస్ కేసు నమోదు చేశారని జిల్లా కలెక్టర్ హరీష్ తెలిపారు. సదరు అభ్యర్థిని సమగ్ర విచారణ నిమిత్తం పోలీసులకు అప్పగించడం జరిగిందన్నారు. ఈ సంఘటన మినహా జిల్లా వ్యాప్తంగా ఉదయం సెషన్‌లో జరిగిన గ్రూప్ 4 పేపర్ 1 పరీక్ష ప్రశాంతంగా జరిగిందని తెలిపారు.

## ఇవిఎంలు,వివిప్యాట్‌లు గోదాములో భద్రపరిచిన వైనం

**-పరిశీలించిన జిల్లా అదనపు కలెక్టర్లు**



మేడ్చల్ కలెక్టరేట్‌లోని ఈవిఎం గోదామును సందర్శించిన జిల్లా అదనపు కలెక్టర్లు నర్సింహ్మారెడ్డి, అభిషేక్ ఆగస్త్య, పలు రాజకీయ పార్టీల నాయకులు

**శామీర్‌పేట, (మేడ్చల్ జిల్లా ప్రతినిధి) జూలై 1, ప్రభాతవార్త**
గత 19రోజుల నుంచి మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో పరిశీలించిన ఈవిఎంలు, వివిప్యాట్లను కలెక్టరేట్‌లోని గోదాములో భద్రపరిచారు. శనివారం కలెక్టరేట్ కార్యాలయంలోని ఈవిఎం గోదాములో భద్రపరిచిన ఈవిఎం మిషన్‌లను మాక్‌పోల్ నిమిత్తం జిల్లా అదనపు కలెక్టర్లు నర్సింహ్మారెడ్డి, అభిషేక్ ఆగస్త్యల ఆధ్వర్యంలో ఒపెన్ చేయటం పలు రాజకీయ పార్టీలకు సంబంధించిన నాయకులు సమక్షంలో మాక్‌పోల్ నిర్వహించటం జరిగింది. దీనిలో శామీర్‌పేట మండల కాంగ్రెస్ అధ్యక్షులు వై.శంకర్‌గౌడ్, తూంకుంట మున్సిపాల్టీ కాంగ్రెస్ అధ్యక్షులు బి.జైపాల్‌రెడ్డి, మల్కాజ్‌గిరి మండల కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షులు శంకర్, బిఎస్‌పి మేడ్చల్ నియోజకవర్గ అధ్యక్షులు చీర్యాల జంగయ్య, శామీర్‌పేట మండల బిజెపి అధ్యక్షులు కైర యాదగిరి, బిజెపి నాయకులు ఎం.నర్సింహ్మా, శామీర్‌పేట మండల బిఆర్ఎస్ ఉపాధ్యక్షులు డి.శ్రీకాంత్‌గౌడ్, పలువురి సమక్షంలో వాటిని మాక్‌పోల్ నిమిత్తం ఒపెన్ చేయటం జరిగిందని వారు వివరించారు.

## పట్టాదారు పాసుపుస్తకాలు రాక రైతుల అవస్థలు



**మాడ్గుల, జూలై01, ప్రభాతవార్త:-**
భూముల సమస్యలకు పరిష్కారం చూపాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ధరణి ప్రతిష్ఠాత్మకంగా తీసుకొచ్చింది. అయినా రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. ధరిణిలో పట్టా చేయించుకున్న రైతులకు వారం రోజుల్లో తపాలా కార్యాలయం ద్వారా పాసుపుస్తకాలు వస్తుందని ప్రభుత్వం చెప్పిన మాటలు క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదు. పట్టామార్పిడి జరిగి నెలలు గడుస్తున్నా పాసుపుస్తకాలు పంపిణీ కాకపోవడంతో అన్నదాతలు చెప్పులు అరిగేలా తహశీల్దార్, తపాల కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. పాసుపుస్తకం రాకపోవడంతో అన్‌లైన్‌లో రూ.300 చెలించి దరఖాస్తు చేసుకోవాలని అధికారులు చెప్పడంతో మూడు, నాలుగు సార్లు రుసుం చెల్లించినా రావడం లేదని వాపోతున్నారు. తహశీల్దార్ కార్యాలయానికి వేళ్తే తమకు తెలిదని, తపాల కార్యాలయానికి వేళ్లి తెలుసుకోవాలని సూచిస్తున్నారు. అక్కడకు వేళ్తే వారు తిరిగి తహసీల్ కార్యాలయానికి వెళ్లాలని చెబుతుండడంతో రేతులు ఆయోమయానికి గురవుతున్నారు. రైతుబందుకు దరఖాస్తులు చేసుకోవాలంటే అన్‌లైన్ ద్వారా వచ్చే జిరాక్స్ పాసుపుస్తకం తీసుకుని దరఖాస్తులు చేసుకోవాల్సిన దుస్థితి నెలకొంది. భూములు క్రయ విక్రయాలు చేసే సమయంలో పట్టాదారు పాసుపుస్తకం లేకుంటే తహసీల్దార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేసే పరిస్థితి లేదు అధికారులు స్పందించి సకాలంలో పాసుపుస్తకాలను అందించి తమకు సమస్యలను తీర్చాలని బాదిత రైతులు కోరుతున్నారు.

**రెండు సార్లు దరఖాస్తు చేసుకున్న**
**-శ్రీనివాస్‌రెడ్డి, రైతు**

మండలంలోని ఆర్కపల్లి గ్రామ శివారులో వ్యవసాయ భూమి కొనుగోలు చేశాను. రిజిస్ట్రేషన్ జరిగిన వారం రోజుల్లో తపాలా కార్యాలయం ద్వారా ఇంటికే పాసుపుస్తకం వస్తుందని అధికారులు చెప్పారు. నెలలు గడుస్తున్న పాస్‌పుస్తకం రాకపోవడంతో తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లినా తెలియదన్నారు. దీంతో మళ్లీ అన్‌లైన్ ద్వార దరఖాస్తు చేకున్నాను. ఇప్పటీకి రాలేదు వస్తుందో రాదో తెలియడం లేదు.

వారం నుండి వస్తున్నాయి-నాయబ్ తహసీల్దార్ రాజశేకర్ ధరణిలో భూములకు రిజిస్ట్రేషన్ జరిగిన అనంతరం పట్టాదారు పాస్ పుస్త కాలు వారంలో వచ్చేవి. కాని ఇటివల ఎక్కడ నిర్లక్ష్యం జరుగిందో తెలియదు కాని వారం క్రిత్రం వరకు రాలేదు. వారం నుండి వస్తున్నాయి.

## అక్రమంగా గంజాయి తరలిస్తున్న యువకుడి అరెస్టు



అక్రమగా గంజాయి తరలిస్తున్న వ్యక్తితో సీఐ మల్లయ్య తదితరులు.

**ఘట్‌కేసర్ రూరల్, జూలై 1, ప్రభాతవార్త:**
అక్రమంగా గంజాయిని తరలిస్తున్న యువకుడ్ని అరెస్టు చేసి కోర్టుకు రిమాండ్ చేసిన సంఘటన ఘట్‌కేసర్ ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం చోటుచేసుకుంది. ఘట్‌కేసర్ ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ సీఐ మల్లయ్య కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. ఎక్సైజ్ పోలీసులు ఘట్‌కేసర్ వై జంక్షన్ వద్ద జాతీయ రహదారిపై వాహనాలు తనిఖీ చేస్తుండగా ఓ యువకుడు వరంగల్ వైపు నుండి రాంపల్లి వైపు స్కూటీపై వెళ్తుండగా స్కూటీ ఆపి తనిఖీ చేయగా స్కూటీ డిక్కీలో దాదాపు రెండు కిలోల 300 గ్రాముల ఎండు గంజాయి పట్టుబడినట్లు పోలీసులు తెలిపారు. స్కూటీతో పాటు సదరు యువకుడ్ని పోలీస్‌స్టేషన్‌కు తరలించి విచారించగా కాప్రా పరిధిలోని చంద్రపురి కాలనీకి చెందిన బి. డేవిడ్ ( 20 )గా తెలిపినట్లు పోలీసులు తెలిపారు. ఎండు గంజాయిని అరకు నుండి అక్రమంగా తక్కువ ధరకు ఇక్కడికి జవహర్ నగర్, కాప్రా పరిధిలోని కళాశాల విద్యార్థులు, గంజాయి ప్రియులకు అధిక ధరకు విక్రయిస్తున్నట్లు తెలిపారు. నిందితుడి డేవిడ్‌పై కేసు నమోదు చేసి అతని వద్ద పట్టుబడిన రెండు కిలోల 300 గ్రాముల ఎండు గంజాయితోపాటు హోండా యాక్టీవిటీ స్కూటీ, మోబైల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పట్టుబడిన నిందితుడ్ని కోర్టుకు రిమాండ్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మల్లయ్య పేర్కొన్నారు.

## గనులలో తనిఖీలు నిర్వహించిన అధికారులు

**- నాపరాతి కోత బ్లేడ్లు స్వాధీనం**
**-గనులలో నుండి పరారైనా కూలీలు, యజమానులు**

**బషీరాబాద్, జూలై 01, ప్రభాతవార్త:**
అనాధికారికంగా గనులు తవ్వి సొమ్ము చేసుకుంటున్న వారి నుండి నాపరాతి కోత పరికరాలు, బ్లేడులను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. బషీరాబాద్ మండల పరిధిలోని జీవన్గి గ్రామ సరిహద్దుల్లో గల ప్రభుత్వ భూమిలో కొంతమంది అక్రమంగా నాపరాతి తవ్వకాలు జరిపి సొమ్ము చేసుకుంటున్నారు. ఈ విషయంపై పలు పత్రికల్లో అనేక కథనాలు ప్రచురితం కావటంతో శనివారం నాడు జీవన్గి నాపరాతి గనులల్లో తనిఖీలు నిర్వహించి పలు యంత్రాల నుండి బ్లేడులను స్వాధీనం చేసుకున్నారు. తనిఖీలు నిర్వహించిన వారిలో మైనింగ్ అధికారిణి టిఏ. నాగలక్ష్మి, మైనింగ్ సర్వేయర్ లక్ష్మినారాయణ, ఆర్ ఐ రాకేష్, సర్వేయర్ ప్రభు, విఆర్ఏలు ఉన్నారు.



రెవెన్యూ సిబ్బందితో టి ఏ నాగలక్ష్మి

## కొత్తూర్‌లో గేటు బయటే పలువురు యువతీ,యువకులు

**కొత్తూర్, జూలై 1, ప్రభాతవార్త :**
రాష్ట్రవ్యాప్తంగా గ్రూప్-4 పరీక్ష ప్రారంభమైంది. పరీక్ష కోసం టీఎస్‌పీఎస్ పగడ్బందీగా ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉదయం 9:45 గంటల దాటిన తర్వాత అభ్యర్థులను లోనికి అనుమతించమని టీఎస్‌పీఎస్సీ స్పష్టం చేసింది. దీంతో సమయం గడిచిన వెంటనే అధికారులు పరీక్ష కేంద్రాల గేట్లను మూసి వేశారు. పలువురు అభ్యర్థులు ఆలస్యంగా వచ్చిన వారిని పోలీసులు లోపలికి అనుమతించలేదు. వారు అధికారులను వేడుకునే దృశ్యాలు పరీక్ష కేంద్రాల్లో కనిపించాయి. కొత్తూర్ మండల తహసీల్దార్ రాములు మాట్లాడుతూ.... పరీక్షకు 15నిమిషాల ముందే పరీక్ష కేంద్రాల వదద తలుపులు మూసివేస్తారని లోపలికి ఎట్టి పరిస్థితిలో అనుమతించబోమన్నారు. మరోవైపు గ్రూప్-4 పరీక్షను రెండు పేపర్లతో టీఎస్‌పీఎస్సీ నిర్వహించనుందన్నారు. పేపర్-1 ఉదయం 10గంటల నుంచి 12:30 గంటల వరకు, పేపర్-2ను మధ్యాహ్నం 2:30గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు నిర్వహించడం జరుగుతుందన్నారు. కొత్తూర్‌లో రెండు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రభుత్వ స్కూల్ సెంటర్‌లో 288మంది అభ్యర్థులకు 213 మంది, 75మంది గైరా్హజరు. మాంటిసోరి హై స్కూల్ కేంద్రంలో 216మందికి 158మంది హాజరు, 66మంది గైర్హాజరయ్యారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 8,180 పోస్టుల భర్తీ కోసం గ్రూప్-4 నోటిఫికేషన్ విడుదలవగా 9.51లక్షల మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. గ్రూప్-4 పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి.



పరీక్ష రాసేందుకు ఆలస్యంగా రావడంతో గేటు బయట ఉన్న అభ్యర్థులు

## రైలు ఢీ కొని 50 గొర్రెలు మృతి

**ధారుర్ జూలై1, ప్రభాతవార్త :**
ధారుర్ మండల పరిధిలోని ధారుర్ స్టేషన్ గ్రామ సమీపంలో ఉన్న రైలు పట్టాలు దాటుతుండగా 50 గొర్రెలు రైలు ఢీకొని చనిపోయాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ..మండల పరిధిలోని దోర్నాలు గ్రామానికి చెందిన కురువ కిష్టయ్య తమ గొర్రెలు మేపడానికి రోజువారీగా ధారుర్ అడవిలోని మేపుకొని వస్తాడు. రోజు వారిగానే శనివారం తిరిగి వస్తుండగా హుబ్లీ ఎక్స్‌ప్రెస్ రైలు కిందపడి సుమారు 50 గొర్రెలె మరణించాయి. సుమారు నాలుగు లక్షల నష్ట వాటిల్లిందని గొర్రెల యజమాని కురువ కిష్టయ్య తెలిపారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని వారు కోరారు.



రైలు ఢీకొన్ని మృతి చెందిన గొర్రెలు దృశ్యం

## కవ్వగూడ పాఠశాల విద్యార్థులకు నోటు బుక్కులు పంపిణీ



విద్యార్థులకు బుక్స్ అందజేస్తున్న బాలు ముదిరాజ్

**శంషాబాద్ జూలై1,ప్రభాతవార్త :**
ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు ప్రతి ఒక్కరు సహకరించాలని యువ నాయకుడు బాలు ముదిరాజ్ సూచించారు.కవ్వగూడ గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు బాలు ముదిరాజ్ తన సొంత డబ్బులతో విద్యార్థులకు నోటు బుక్కులు పెన్నులు ,పెన్సిల్లు పలుకలు పంపిణీ చేశారు.శనివారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో వీటిని అందజేసి సందర్భంగా ఆయన మాట్లాడుతూ...భావి భారత పౌరులైన చిన్నారి విద్యార్థులు కష్టపడి ఉన్నత విద్యను అభ్యసించాలని సూచించారు.ప్రతి పౌరుడు ఉన్నత చదువులు చదువుకుంటనే దేశం బాగుపడు తుందని దీనికోసం పేద మధ్యతరగతి విద్యార్థులకు అందరూ సహకరించాలని సూచించారు.ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే పేద విద్యార్థులకు అందరూ సహకరించి వారికి మెరుగైన విద్య అం దే విధంగా చర్యలు తీసుకోవాలని కుక్కల బాలు ముదిరాజ్ సూచించారు.

## ఆర్‌బి నగర్‌లో సిసి రోడ్డు ప్రారంభం



సిసి రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు

**శంషాబాద్ జూలై1,ప్రభాతవార్త :**
శంషాబాద్ పురపాలక సంఘం పరిధిలోని ఆర్.బి నగర్ 24వ వార్డులో నూతనంగా ఏర్పాటు చేసిన సిసి రోడ్డును స్థానిక కౌన్సిలర్ కోనమొళ్ల భారతమ్మ నరసింహ ప్రారంభించారు.మున్సిపల్ చైర్‌పర్సన్ కొలను సుష్మామహేందర్ రెడ్డి ,నార్సింగ్ మార్కెట్ కమిటీ చైర్మన్ దూడల వెంకటేష్ గౌడ్ సమక్షంలో ఆమె సిసి రోడ్డును ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ...వార్డు అభివృద్ధికి కావాల్సిన అన్ని చర్యలను చేపడుతున్నట్లు తెలిపారు. వార్డులో అభివృద్ధికి సహకరిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మా మహేందర్ రెడ్డి అధికారులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ మాట్లాడుతూ..రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సహకారంతో సమస్యలు లేని వార్డులుగా తీర్చిదిద్దడానికి ప్రయత్నిస్తున్నామని అన్నారు.గతంలో ఎన్నడూ లేని విధంగా మున్సిపల్‌లో అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు కొనమొల్ల శ్రీనివాస్,జి.వై ప్రభాకర్ ప్రసాద్,నరేందర్ గౌడ్,వెంకట్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## కేంద్రం నిధులు...రాష్ట్రం గొప్పలు



మహిళలతో మాట్లాడుతున్న భువనేశ్వరి

**జిల్లెడు చౌదరిగూడ, జులై 1,(ప్రభాతవార్త):**
రాష్ట్రాల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం విడుదల చేస్తున్న నిధులతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటుందని బిజెపి తమిళనాడు మహిళమోర్చా ఉపాధ్యక్షురాలు భువనేశ్వరి అన్నారు. శనివారం జిల్లెడు చౌదరిగూడ మండలంలోని ఎదిర, తూంపల్లి గ్రామాల్లో మహాజన్ సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామాల్లోని ప్రజలకు కేంద్ర ప్రభుత్వం నుంచి విడుదల అవుతున్న నిధుల వివరాలను వివరించారు. బిజెపి కార్యకర్తలు ప్రతి ఇంటికి తిరిగి కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించాలని ఆమె సూచించారు. అలాగె రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు తెలుపాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షుడు బోయ కుర్మయ్య, నర్సింహులు, రాము, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## యువమోర్చా ఆధ్వర్యంలో జన సంపర్క్ అభియాన్



కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న బిజెపి నాయకులు

**శంషాబాద్ జూలై1,ప్రభాతవార్త :**
భారతీయ జనతా యువమోర్చా ఆధ్వర్యంలో జన సంపర్క అభియాన్ కార్యక్రమాన్ని బుధవారం హాజి బస్తీ నుండి బస్టాండ్ వరకు నిర్వహించారు.భారత ప్రధాని నరేంద్ర మోడీ 9 సంవత్సరాలలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించనున్నట్లు రాష్ట్ర ఉపాధ్యక్షుడు బైతి శ్రీధర్ యాదవ్ తెలిపారు.నరేంద్ర మోడీ కేంద్రంలో అధికారం చేపట్టిన 9 సంవత్సరాలలో ప్రపంచవ్యాప్తంగా దేశానికి ఎనలేని కీర్తి ప్రతిష్టలు కలిగాయని అన్నారు. దేశంలో శాంతి భద్రతలు ఒకటి బందీగా అమలు చేయడంతో ఎక్కడ ఇలాంటి అవాంఛనీయ సంఘటనలు ముఖ్యంగా ఉగ్రదాడులు అవినీతి అక్రమాలు జరగడంలేదని పేర్కొన్నారు.మోడీ పాలనపై ప్రజలు పూర్తి సంతృప్తితో ఉన్నారని మళ్లీ మోడీ పాలనను జనాలు కోరుకుంటున్నారని శ్రీధర్ యాదవ్ అన్నారు.రాష్ట్రంలో కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నిధులతోనే రాష్ట్రం అభివృద్ధి జరిగింది.కేంద్ర ప్రభుత్వ పథకాలకు పేర్లు మార్చి రాష్ట్ర ప్రభుత్వం తాము చేసినట్లుగా గొప్పలు చెప్పుకుంటున్నదని దీనిపై బహిరంగ చర్చకు రావాలని సవాలు విసిరారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర యువమోర్చా అదనపు కార్యదర్శి చేవెళ్ల మహేందర్ ,జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ యాదవ్,దేవేందర్,భాస్కర్ రెడ్డి,క్కుల సిద్దు,మునగాల రాజిరెడ్డి,మాదిరెడ్డి,మహిపాల్ రెడ్డి,చల్లా శ్రీను,అశోక్ మహేష్, రాకేష్,జనార్ధన్ రెడ్డి,అమరేందర్ రెడ్డి,వీరేష్,పాల్గొన్నారు.

**మృతి చెందిన గీత కార్మికుడు కుటుంబానికి ఆర్థిక సహాయం**

**కడ్తాల్,జులై 01 ప్రభాతవార్త :** కడ్తాల్ మండలం చరికొండ గ్రామంలో శుక్రవారం గీత కార్మికుడు నరసింహగౌడ్ తాటిచెట్టు మీది నుండి పడి చనిపోయాడు. శనివారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఆధ్వర్యంలో నర్సింహగౌడ్ భౌతిక కాయానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చాడం జరిగింది. కాంగ్రెస్ పార్టీ తరఫున 5 వేల ఆర్థిక సాయం చేయడం జరిగింది. నర్సింహగౌడ్ కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటాం అని భరోసా ఇచ్చారు. పరామర్శించిన వారిలో పిసిసి సభ్యులు అయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, డిసిసి అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, డిసిసి కార్యదర్శి బిక్యనాయక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు యట్ట నరసింహ, సింగిల్ విండో డైరెక్టర్ చేగూరి వెంకటేష్, చరికొండ ఎంపిటిసి సభ్యులు పాలకుర్ల రాములుగౌడ్,సత్యం, మహెందర్, వెంకటయ్యగౌడ్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# ఎస్టీ సబ్ ప్లాన్‌తో మండలానికి రూ.14.24 కోట్లు మంజూరు

**-జడ్పీటిసి జర్పుల దశరథ్ నాయక్**



విలేఖరుల సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీటిసి జర్పుల దశరథ్‌నాయక్

**కడ్తాల్,జులై 1 ప్రభాతవార్త :**
ఎస్టీ సబ్ ప్లాన్ కింద కడ్తాల్ మండలానికి 14,24 కోట్లు మంజూరయ్యాయని కడ్తాల్ పట్టణంలోని శనివారం విలేఖరుల సమావేశంలో గ్రామీణాభివృద్ధి స్టాండింగ్ కమిటి జిల్లా సభ్యులు కడ్తాల్ జడ్పీటిసి జర్పుల దశరథ్‌నాయక్ తెలిపారు. ఎస్టీ సబ్‌ప్లాన్ కింద మంజూరైన మండలంలోని తొమ్మిది తండాలకు బిటి రోడ్డు కార్యక్రమాన్ని సోమవారం 9 గం.లకు ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ చేతుల మీదుగా శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. ఇకపై తండాలకు ఎలాంటి మట్టి రోడ్డు లేకుండా సీఎం కెసిఆర్ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ కృషితో ఇప్పుడు రాబోయే రోజుల్లో అన్ని తండాలకు బిటి రోడ్లు పడుతున్నాయి. ఎస్టీలపై అమితమైన ప్రేమ చూపించి ఎస్టీ సబ్‌ప్లాన్ కింద కడ్తాల్ మండలానికి 14 కోట్లు మంజూరు చేయించిన ఎమ్మెల్యే జైపాల్ యాదవ్‌కి సీఎం కెసిఆర్‌కి కృతజ్ఞతలు తెలిపారు. తండాల అభివృద్ధి కోసం పాటు పడుతున్న బిఆర్ఎస్ ప్రభుత్వాన్ని గిరిజనులు కోరుకుంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు కంబాల పరమేష్, పిఎసిఎస్ ఛైర్మన్ గంప వెంకటేష్, వైస్ ఎంపిపి బావండ్లపల్లి ఆనంద్, రైతు కో ఆర్డినేటర్ జోగు వీరయ్య, ఎంపిటిసిలు లచ్చిరామ్‌నాయక్, బొప్పిడి గోపాల్, సర్పంచ్‌లు రవిందర్‌రెడ్డి, లోకేష్, సులోచన సాయిలు, కమ్లి బిచ్చ, బావోజీ, పూజా, దేవానాయక్, డైరెక్టర్ సేవ్యనాయక్, ఉపసర్పంచ్‌లు రామకృష్ణ, రమణ, శారదాపాండు, వార్డు సభ్యులు భీమన్, లక్ష్మణ్, రమేష్, మహేష్, సోమ్లా, సుశీలదేవుల నాయక్, కిషన్‌నాయక్, పంతు గణేష్, శంకర్, రమేష్, రవి, రాజు, కృష్ణ, శ్రీను, శ్రీకాంత్, రామకృష్ణ, జంగయ్య,చందు, అంజి,భాస్కర్, నాయకులు పాల్గొన్నారు.

# ఘట్‌కేసర్‌లో ప్రశాంతంగా గ్రూప్-4 పరీక్ష



పరీక్షా కేంద్రం వద్ద బందోబస్తులో పాల్గొన్న ఘట్‌కేసర్ సీఐ మహేందర్‌రెడ్డి, సిబ్బంది

**ఘట్‌కేసర్, జూలై 1, ప్రభాతవార్త:**
ఘట్‌కేసర్ మండలంలో శనివారం టీఎస్‌పీఎస్‌సీ గ్రూపు-4 పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. మండలంలో ఏర్పాటు చేసిన 15 పరీక్షా కేంద్రాలలో గట్టి పోలీస్ బందోబస్తు నిర్వహించి పరీక్ష నిర్వహించారు. ఘట్‌కేసర్ తహశీల్దార్ ఎన్.విజయలక్ష్మి ఆధ్వర్యంలో ఉదయం పేపర్-1, మధ్యాహ్నం పేపర్-2 పరీక్షలను సజావుగా పూర్తి చేశారు. మండలంలో 10,920 మంది అభ్యర్థులు గ్రూపు-4 పరీక్షకు హాజరు కావాల్సి ఒక్కో కేంద్రంలో 70 నుంచి 200 మంది దాకా గైర్హాజరయ్యారు. అంకుశాపూర్ ఏసీఈ పరీక్ష కేంద్రంలో 840 మందికి గాను 580 మంది హాజరయ్యారు. ఘణాపూర్ కేపీఆర్‌ఐటీలో 480 మందికి గాను 334 మంది హాజరు కాగా కొండాపూర్ సంస్కృతిలో 240 మందికి గాను 161 మంది, విజ్ఞాన్ మహిళా కళాశాలలో 240 మందికి గాను 179 మంది, ఎదులాబాద్ మేఘా మహిళా కళాశాలలో 624 మందికి గాను 459 మంది, అవుషాపూర్ అల్ర్పోజ్‌లో 336 మందికి గాను 245 మంది, విబీఐటీలో 1,008 మందికి గాను 720 మంది, ఘట్‌కేసర్ శ్రీవివేకానంద జూనియర్ కళాశాలలో 288 మందికి గాను 201 మంది, శ్రీచైతన్యడిగ్రీ కళాశాలలో 288 మందికి గాను 204 మంది, ఐఐటీఎం డిగ్రీ కళాశాలలో 312 మందికి గాను 222 మంది, కెఎల్‌ఆర్‌నగర్ రిషి స్కూల్‌లలో 360 మందికి గాను 260 మంది చొప్న పరీక్షకు హాజరు అయ్యారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు పేపర్-1 జనరల్ నాలెడ్జ్, మధ్యాహ్నం 2:30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పేపర్-2 సెక్రటేరియేట్ ఎబిలిటీస్ పరీక్షలు జరిగాయి. అభ్యర్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసి హాల్‌టికెట్లు, గుర్తింపు కార్డు చూసిన తర్వాతనే పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించారు. ఈసందర్భంగా మల్కాజ్‌గిరి ఏసీపీ నరేశ్‌రెడ్డి పర్యవేక్షణలో ఘట్‌కేసర్ ఇన్‌స్పెక్టర్ ఎం.మహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో పరీక్షా కేంద్రాల 144 సెక్షన్ విధించి గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. కాగా ఉదయం పేపర్-1 పరీక్షా పూర్తి కాగానే ఆహారం కోసం మధ్యాహ్నం అభ్యర్థులు హోటళ్లు, బేకరీలకు పరుగులు తీశారు. దీంతో ఘట్‌కేసర్ పట్టణంలోని రెస్టారెంట్లు, బేకరీలు, పాస్ట్‌ఫుడ్ దుకాణాలు రద్దీగా మారాయి.

## గ్రూప్ పరీక్షలు సజావుగా జరిగాయి : తహసీల్దార్ గోపాల్

**- పేపర్ 1కు 3587, పేపర్ 2కు 3581 మంది అభ్యర్థులు హాజరు**



పరీక్ష కేంద్రానికి ఆలస్యంగా వచ్చిన అభ్యర్థులు.

**షాద్‌నగర్, జూలై 01, (ప్రభాతవార్త) :** తెలంగాణ పబ్లీక్ సర్వీస్ కమీషన్, ప్రభుత్వ నియమ నిబంధనలకు లోబడి శనివారం నిర్వహించిన గ్రూప్ 4 పరీక్షలు సజావుగా జరిగాయని ఫరూఖ్‌నగర్ మండల తహసీల్దార్ గోపాల్ తెలిపారు. ఫరూఖ్‌నగర్ మండలంలో ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలతో కలిపి మొత్తంగా 19 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 వరకు నిర్వహించిన పేపర్ 1 పరీక్షకు 3587 మంది అభ్యర్థులు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించిన పేపర్ 2కు 3581 మంది అభ్యర్థులు పరీక్షలు రాశారు. ఈ 19 పరీక్ష కేంద్రాలకు గాను 5892 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా పేపర్ 1కు 2305, పేపర్ 2కు 2311 మంది అభ్యర్థులు గైర్హాజరైనట్లు తహసీల్దార్ శనివారం సాయంత్రం మీడియాకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.... గ్రూప్ 4 పరీక్షలకు 19 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని, అన్ని శాఖల అధికారులతో పరీక్షలు సజావుగా జరిగాయని ఆయన తెలిపారు. ముఖ్యంగా పోలీస్ శాఖ పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించడం వల్ల ఎలాంటి అవంచనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పరీక్షలు పూర్తి చేయడం జరిగిందని అన్నారు. సాయంత్రం 7 గంటలకు పరీక్ష పత్రాలను పంపించడం జరిగిందని ఆయన తెలిపారు.

**ఆలస్యంగా పరీక్ష కేంద్రాలకు చేరుకున్న పలువురు అభ్యర్థులు...**
షాద్‌నగర్‌లో నిర్వహించిన గ్రూప్‌పరీక్షలకు పలువురు అభ్యర్థులు ఆలస్యంగా పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. ప్రభుత్వం నిర్దేశించిన సమయానికి చేరుకోలేని అభ్యర్థులను నిర్వహకులు లోపలకి అనుమతించకపోవడంతో అభ్యర్థులు వెనుతిరగాల్సిన పరిస్థితి నెలకొంది. కొంత మంది విద్యార్థులు నిర్వహకులను ఎంతగానో ప్రాధేయపడ్డా ప్రయోజనం లేకపోయింది. పట్టణంలోని శ్రీచైతన్య, సత్యసాయి, శ్రీ నారాయణ తదితర విద్యాసంస్థల్లో ఆలస్యంగా వచ్చిన అభ్యర్థులు పేపర్ 1 పరీక్ష రాయలేకపోవడంతో 2వ పేపర్ పరీక్ష కోసం పరీక్ష కేంద్రాల వద్ద నిరీక్షిస్తూ కూర్చున్నారు. ఈ సందర్భంగా పలువురు అభ్యర్థులను మీడియా సంప్రదించగా దూర ప్రాంతాలను వచ్చామని, పరీక్ష కేంద్రాల అడ్రసులు దొరలేదని వాపోయారు. మరికొంత మంది విద్యార్థులు బైపాస్ మీదుగా రావడంతో షాద్‌నగర్ పట్టణంలోకి వచ్చే మార్గంలో రైల్వే గేటు పడటంతో కొంత మంది విద్యార్థులు ఆలస్యమైపోయిందని బాధతో ఆవేదన వ్యక్తం చేశారు. ఏది ఏమైనప్పటికీ పరీక్షలకు సమయానికి కంటే ముందే హాజరు కావాలని అధికారులు పదే పదే చెబుతున్న కొంత మంది అభ్యర్థులు సమయానికి పరీక్ష కేంద్రాలకు చేరుకోలేకపోతున్నారు.

## రొటర్‌డ్యామ్‌లో ఘనంగా కౌన్సిల్ వేడుకలు




చౌదరిగూడ రొటర్‌డ్యామ్‌లో జరిగిన కౌన్సిల్ వేడుకల్లో విద్యార్థులను ప్రశంసిస్తున్న డైరక్టర్ శ్వేతారెడ్డి, ప్రిన్సిపల్ రూపారెడ్డి

**ఘట్‌కేసర్, జూలై 1, ప్రభాతవార్త:**
ఘట్‌కేసర్ మండలం చౌదరిగూడలోని రొటర్‌డ్యామ్ అంతర్జాతీయ పాఠశాలలో శనివారం కౌన్సిల్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థి మండలి సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవం వైభవంగా జరిగింది. విద్యార్థుల్లో జ్ఞానం, నాయకత్వ లక్షణాలు పెంపొందించేందుకు ప్రతి సంవత్సరం ప్రతిష్టాత్మకంగా ఈకార్యక్రమం నిర్వహిస్తున్నట్లు స్కూల్ యాజమాన్యం తెలియజేసింది. విద్యార్థుల సాంస్కృతిక నృత్య ప్రదర్శనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రిన్సిపల్ రూపారెడ్డి, డైరక్టర్ శ్వేతారెడ్డిలు పాల్గొని పాఠశాల జెండాను ఆవిష్కరించారు. పాఠశాల గాయకబృందం పాఠశాల గీతాన్ని మధురంగా ఆలపించారు. కొత్తగా ఎన్నికైన విద్యార్థి కౌన్సిల్ మార్చ్‌ఫాస్ట్ ప్రదర్శన అందరిని ఆకట్టుకుంది. హౌస్ విద్యార్థులు, స్టూడెంట్ కౌన్సిల్ విద్యార్థులు, హౌస్ మెంటర్స్ ఉత్సాహంగా పాల్గొన్నారు. కొత్తగా నియమితులైన హెడ్‌బాయ్, హెడ్ గాల్‌కి స్టూడెంట్ కౌన్సిల్ విద్యార్థులందరికీ ప్రిన్సిపల్, డైరక్టర్లు బాడ్జీలను అందజేశారు. ప్రిన్సిపల్ రూపారెడ్డి మాట్లాడుతూ హెడ్‌లు ఎంతోకష్టపడి నాయకుడిగా ఎద గాలని మిగిలిన విద్యార్థులకు కూడా స్ఫూర్తిని కల్గించాలన్నారు. ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణతో ఎదైనా సాధించవచ్చని చెప్పారు. అబ్దుల్‌కలాంలాగా నాయకత్వ లక్షణాలను విద్యార్థి దశలోనే ఏర్పరచుకోవాలన్నారు. విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలను మెరు గుపరచడానికి రొటర్‌డ్యామ్ చేస్తున్న కృషి అభినందనాయమన్నారు. ఈసందర్భంగా కొత్తగా నియమితులైన విద్యార్థులను అభినందించి వారి భాధ్యతలను గుర్తు చేశారు. విద్యార్థుల చేత ప్రమాణస్వీకారం చేయించారు. హౌస్ మెంటర్స్ తమ గ్రూపు విద్యార్థులకు ప్రోత్సాహన్ని అందిస్తూ ప్రసంగించారు. ఈకార్యక్రమంలో టీచర్లు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

**ఏయూలో డేటాసైన్స్‌పైతాన్ వినియోగంపై సదస్సు**

**ఘట్‌కేసర్, జూలై 1, ప్రభాతవార్త:**
ఘట్‌కేసర్ మండలం వెంకటాపూర్‌లోని అనురాగ్ విశ్వవిద్యాలయంలో శనివారం డేటాసైన్స్ పైతాన్ ప్రోగ్రామింగ్‌బాష కార్యక్రమం నిర్వహించారు. ఏ2ఐ అనుసంధానంతో బాష వినియోగంపై కృత్రిమ విభాగం నిర్వహించారు. విభాగాధిపతి డాక్టర్ మల్లికార్జున్, కార్యక్రమం సంచాలకులు విక్టర్ డేనియల్‌లు హాజరై డేటాసైన్స్ వినియోగంపై అవగాహన కల్పించారు. విద్యార్థులు, యువత ప్రగతిపథం వైపు పురోగమించాలని సూచించారు. విద్యార్థులు పేర్లు నమోదు చేసుకొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈకార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థుల సంచాలకులు మొనీష్, సంజనా తదితరులు పాల్గొన్నారు.



వెంకటాపూర్ ఏయూలో జరిగిన డేటాసైన్స్ పైతాన్ ప్రోగ్రామింగ్ కార్యక్రమంలో పాల్గొన్న హెచ్ఓడి మల్లికార్జున్, డైరక్టర్ విక్టర్ డేనియల్, విద్యార్థులు

## విద్యార్థులకు ఉచితంగా నోట్‌బుక్స్ పంపిణీ



పొన్నాల్ ప్రాధమిక పాఠశాలలో విద్యార్థులకు ఉచితంగ నోట్‌బుక్స్ పంపిణీ చేసిన దృశ్యం

**శామీర్‌పేట, జూలై 1, ప్రభాతవార్త**
పొన్నాల్ ప్రాధమిక పాఠశాలలో విద్యార్థులకు ఉప్పరిపల్లి గ్రామ మాజీ సర్పంచు కట్టెల రవీందర్ ఉచితంగ నోట్‌బుక్స్, పరికరాలను అందజేశారు. శనివారం శామీర్‌పేట మండలంలోని పొన్నాల్ గ్రామ ప్రాధమిక పాఠశాలలో విద్యార్థులకు నోట్‌బుక్స్, పరికరాలు పలువురు పాల్గొని పంపిణీ చేశారు. గత 6సంవత్సరాల నుంచి విద్యార్థులకు నోట్‌బుక్స్,పరికరాలు కట్టెల రవీందర్ అందజేస్తున్నారన్నారు. కట్టెల రవీందర్ కుమారుడు దినేష్ గ్రామ పెద్దల సమక్షంలో విద్యార్థులకు నోట్‌బుక్స్, పరికరాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు సర్పంచు బి.సుకన్యసత్యనారాయణగౌడ్, ఎంపిటిసి మౌనికశివవీరప్రసాద్, పాఠశాల చైర్మన్ లక్ష్మయ్య, వైస్‌చైర్మన్ మమత, వార్డుసభ్యులు ప్రభాకర్, శివవీరప్రసాద్, కట్టెల రవీందర్ సోదరుడు హరిబాబు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్.సంజీవ, ఉపాధ్యాయులు రవీంద్రచారి, పవిత్రలు పాల్గొన్నారు. పాఠశాల తరపున దాత కట్టెల రవీందర్‌కు హెచ్ఎం, ఉపాధ్యాయులు దన్యవాదాలు తెలిపారు. విద్యార్థుల సంఖ్య అధికంగ ఉన్నం దున ఒక విద్యావలంటరీని ఏర్పాటుకు కోరటం జరిగిందని వారు పేర్కొన్నారు.

## 4న జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, హైదరాబాద్, జూలై 01, (ప్రభాతవార్త) :**
రంగారెడ్డి జిల్లా ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ తీగల అనిత హరినాథ్ రెడ్డి అధ్యక్షతన ఈ నెల 4న ఉదయం 11 గంటలకు జిల్లా పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్లు జిల్లా పరిషత్ సీఈఓ దిలీప్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ఆయా శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు తప్పని సరిగా హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

## బాలికను పెళ్లి చేసుకున్న యువకుడిపై కేసు

**శంకర్‌పల్లి జూలై1,ప్రభాతవార్త :** మైనర్ బాలికను పెళ్లి చేసుకున్న యువకుడిపై పోలీసులు కేసు నమోదు చేశారు.పూర్తి వివరాలు ఇల్లా ఉన్నాయి...మహబూబ్‌నగర్ జిల్లా వనపర్తికి చెందిన 22 సంవత్సరాల రజనీకాంత్ గత కొన్నాళ్ల నుంచి వికారాబాద్ జిల్లా నవాబ్ పేట్ మండలంలోని ఓ గ్రామంలో తాపీ మేస్త్రీగా పనిచేస్తున్నాడు.14 సంవత్సరాల మైనర్ బాలిక కుటుంబంతో సన్నిహితంగా ఉండేవాడని సమాచారం కాగా ఇటీవల మైనర్ బాలిక కుటుంబం రెండు నెలల క్రితం శంకర్‌పల్లిలో ఇల్లు ఖరీదు చేసి స్థిర నివాసం శంకర్‌పల్లికి మర్చారు.అయితే మూడు రోజుల క్రితం అమ్మాయిని తీసుకెళ్లి పెళ్లి చేసుకున్నాడు.దీంతో పోలీసులు చైల్డ్ మ్యారేజ్ యాక్ట్ ప్రకారం కేసు నమోదు చేశారు.తగిన విచారణ చేసి పెళ్లికి సహకరించిన వారందరిపై సైతం కేసు నమోదు చేయనున్నట్లు శంకర్‌పల్లి ఎస్ఐ సంతోష్ రెడ్డి తెలిపారు.

## వైద్యం వృత్తి కాదు మానవాళిని బతికించే ఓ మహాశక్తి



అంతర్జాతీయ వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకుని డాక్టర్ వంగ సంపత్‌కుమార్‌కు ఘన సన్మానం

**శంకర్‌పల్లి, జూలై 01 ప్రభాతవార్త:**
వైద్యం అనేది ఒక వృత్తి కాదని, మానవాళిని రక్షించే ఒక మహాశక్తి అని పలువురు వక్తలు కొనియాడారు. భగవంతుడు జన్మనిస్తే వైద్యుడు పునర్జన్మను ఇస్తాడని అన్నారు. అంతర్జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా శంకర్‌పల్లి పట్టణంలో శనివారం డాక్టర్ వంగ సంపత్‌కుమార్‌ను పలువురు మిత్ర బృందం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైద్య సేవలు అందించడంలో సంపత్‌కుమార్ వైద్య వృత్తికి తలమానికంగా నిలిచారని కొనియాడారు. నిరంతరం తన సమయాన్ని కేటాయిస్తూ పేద రోగులకు కూడా ఉచిత వైద్య సేవలు అందిస్తున్నారని అన్నారు. అనునిత్యం శ్రామికులు అలుపెరుగని సేవకులుగా వైద్యులు పని చేస్తున్నారని ప్రశంసించారు. సృష్టికి జీవం పోసే కృషీవలులుగా వైద్యులు పని చేస్తున్నారని, అటు వారందరికి అంతర్జాతీయ వైద్యుల దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మిరియాల శ్రీనివాస్, కందుకూరి చంద్రశేఖర్, ఎల్ఐసి సుధాకర్, మాశెట్టి పూర్ణచంద్రరావు, మాశెట్టి సురేష్, యువ న్యాయవాది మహమ్మద్ తాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## కీసర నూతన ఎంపిఓగా వినూత్నరెడ్డి



నూతన ఎంపిఓగా బాధ్యతలు చేపట్టిన వినూత్నరెడ్డిని సన్మానిస్తున్న సర్పంచ్ ఆకిటి మహేందర్‌రెడ్డి

**కీసర,జులై1,ప్రభాతవార్త:**
కీసర మండల నూతన ఎంపిఓగా వినూత్నరెడ్డి మండల పరిషత్ కార్యాలయంలో శనివారం బాధ్యతలు చేపట్టారు.మేడ్చల్ మండలంలో పనిచేసిన ఎంపిఓ వినూత్నరెడ్డి కీసర మండలానికి విచ్చేసారు.మండల సర్పంచ్‌లు ఆకిటి మహేందర్‌రెడ్డి,కౌకుట్ల గోపాల్‌రెడ్డి,పిడిశెట్టి పెంటయ్య,సనాల సత్తమ్మ, నాయకులు గరుగుల మల్లేష్‌లు కలిసి శాలువాతో సన్మానించి,పుష్పగుచ్చాలు ఇచ్చి సన్మానించారు.

## అంకిరెడ్డిపల్లి,తిమ్మాయిపల్లిలో సిపిఆర్‌పై అవగాహన



అంకిరెడ్డిపల్లిలో సిపిఆర్‌పై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ కృతిక

**కీసర,జులై1,ప్రభాతవార్త:**
మండలంలోని అంకిరెడ్డిపల్లి,తిమ్మాయిపల్లి గ్రామాలలో సిపిఆర్‌పై డాక్టర్‌లు కృతిక,విజయ్‌ప్రతాప్‌లు శనివారం అవగాహన కల్పించారు.గ్రామ ప్రజలకు, పంచాయతీ సిబ్బందికి అత్యవసర సమయంలో సిపిఆర్ ఏ విధంగా చేయాలో అవగాహన కల్పించారు.మండల వైద్య బృందం ఆద్వర్యంలో గ్రామస్తులకు బిపి,షుగర్‌లు చెక్ చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు మోర విమల నాగరాజు,పిడిశెట్టి పెంటయ్య,ఏఎన్ఎం ఇందిర,ఆశ కార్యకర్త లత, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

## వెంకట్రావుపేటలో ఇంటింటికి బిజెపి కార్యక్రమం



బిజెపి పథకాలను వివరిస్తున్న నాయకులు

**తలకొండపల్లి జూలై1,ప్రభాతవార్త :**
తలకొండపల్లి మండల పరిధిలోని వెంకట్రావుపేట గ్రామంలో 39,40 బూతులలో పనులు పర్యవేక్షణ చేయడం జరిగింది.ఇంటింటికి బిజెపి కార్యక్రమం నిర్వహించి నరేంద్రమోడీ పథకాలను తెలియజేశారు.2024లో మళ్లీ కేంద్రంలో బిజెపి జెండా ఎగురవేయాలని తెలంగాణలో బిజెపి అధికారంలోకి రావడమే లక్ష్యంగా బిజెపి పనిచేస్తుందని వివరించారు.అదేవిధంగా గిరిజన మోర్చా మండల అధ్యక్షుడు రవి నాయక్‌ను పరామర్శించారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు తిరుమణి రవి గౌడ్,బిజెవైఎం రాష్ట్ర అదనపు కార్యదర్శి నీలకంఠ పాండు,39,30 బూతుల శక్తి కేంద్రం ఇంచార్జీ దూగ్గపూరం కుమార్,బిజెపి మండల ప్రధాన కార్యదర్శి హరికాంత్ మండల ఉపాధ్యక్షుడు కమటం దనంజయ్య,మండల కార్యదర్శి శివగట్టు ఇప్పలపల్లి శక్తికేంద్ర ఇన్‌చార్జ్ మహేష్,బూత్ అధ్యక్షుడు కమటం నరేష్ ,రమేష్ నాయక్, వెంకట్రావుపేట నాయకులు లక్ష్మణ్ భరత్ ,రవి,రాములు, పాల్గొన్నారు.

## పండుగ సాయన్న విగ్రహ ఏర్పాటు స్థలం కేటాయించాలి

**తలకొండపల్లి జూలై1,ప్రభాతవార్త :**
తలకొండపల్లి మండల కేంద్రంలో పండుగ సాయన్న విగ్రహ ఏర్పాటుకు స్థలం కేటాయించాలని ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షుడు యాదగిరి ముదిరాజ్ ఆధ్వర్యంలో సర్పంచ్ లలిత జ్యోతయ్య పంచాయతీ కార్యదర్శిని కలిసి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షుడు బోల్ల యాదగిరి మాట్లాడుతూ...తలకొండపల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రహరీ పక్కన పండుగ సాయన్న ముదిరాజ్ హైదరాబాద్ తొలి మేయర్ కొరవి కృష్ణ ముదిరాజ్ ,సావిత్రి బాయి పూలే, జ్యోతి రావు పూలే విగ్రహాలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.విగ్రహాల ఏర్పాటుకు గ్రామపంచాయతీ ద్వారా స్థలాన్ని కేటాయించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నాయకులు బాలకృష్ణ,శ్రీకాంత్ ,,మండల అధ్యక్షుడు బోళ్ల యాదగిరి ముదిరాజ్,పద్మ విట్టల్ ముదిరాజ్,పద్మ అనిల్ ముదిరాజ్,ఈ సారి శ్రీకాంత్,కాసామోని నరేష్,రవి,గణేష్, నాగరాజు,శివ, ఈసారి బాలకృష్ణ,పుట్ట శ్రీరాములు,హరీష్,వినయ్,రాము,శివ,పాల్గొన్నారు.



స్థలం కేటాయించాలని పంచాయతి కార్యదర్శి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

# జిల్లాలో ప్రశాంతంగా గ్రూప్-4పరీక్ష


పరీక్ష కేంద్రం వద్ద అభ్యర్థులు.


హాల్‌టికెట్ నంబర్‌ను చూసుకుంటున్న అభ్యర్థులు

**తాండూరు, జూలై 1, ప్రభాతవార్త :** తెలంగాణ ప్రభుత్వం నిర్వహిస్తున్న గ్రూప్-4 పరీక్ష శనివారం తాండూరులో ప్రశాంతంగా కొనసాగింది. గ్రూప్-4 పరీక్షను దృష్టిలో ఉంచుకొని అధికారులు ముందుగానే అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. పరీక్ష కేంద్రాలలో అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నారు. తాండూరులో సుమారు 5వేల మంది అభ్యర్థులకు మొత్తం 19పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలతో పాటు, సింధూ బాలికల జూనియర్ కళాశాల, చైతన్య, సిద్దార్థ జూనియర్ కళాశాలలు, ప్రభుత్వం, ప్రైవేటు పాఠశాలలు, గురుకుల పాఠశాలలో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. పరీక్ష కేంద్రాలలో అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా


పరీక్ష కేంద్రం దగ్గర పోలీసు బందోబస్తు.

చర్యలు తీసుకున్నారు. అన్ని పరీక్ష కేంద్రాల వద్ద పోలీసులు 144 సెక్షన్ అమలు చేశారు. వికారాబాద్ జిల్లా అడిషనల్ ఎస్పీ మురళీధర్ పరీక్ష కేంద్రాలను పరిశీలించారు. తాండూరులోఎలాంటి ఇబ్బందులు లేకుండా పరీక్ష ప్రశాంతంగా ముగిసింది.

**కొడంగల్ పట్టణంలో**

**కొడంగల్, జూలై1, ప్రభాతవార్త ః** కొడంగల్ పట్టణంలోని నాలుగు పరీక్ష కేంద్రాలలో గ్రూప్-4 పరీక్షలు శనివారం ప్రశాంతంగా ముగిశాయి. పరీక్ష కేంద్రాలను డిప్యూటీ తహసీల్దార్ సురేష్‌కుమార్ పర్యవేక్షించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 240 మంది అభ్యర్థులకు 196 మంది అభ్యర్థులు పరీక్ష రాయడం జరిగిందని, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 312 మంది అభ్యర్థులకుగాను256 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరుకావడం జరిగిందని వారు తెలిపారు. ఈ పరీక్ష కేంద్రాల దగ్గర పోలీస్‌లు బందోబస్తు నిర్వహించారు.

## గ్రామ పంచాయతీ సిబ్బందిని పర్మినెంట్ చేయాలి

**-సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాస్**


వినతిపత్రం అందజేస్తున్న సిఐటియు, కేవిపిఎస్ నాయకులు

**పెద్దేముల్, జులై 1, ప్రభాతవార్త:**
గ్రామ పంచాయతీ సిబ్బందిని వెంటనే పర్మినెంట్ చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యాక్షులు కే.శ్రీనివాస్, కేవిపిఎస్‌జిల్లా సహయ కార్యదర్శి గోపాల్, రాజు, మండల అధ్యక్షులు లింగేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని శనివారం పెద్దేముల్ మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌కు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిఓ నెంబర్ 51ని వెంటనే రద్దు చేసి, జిఓ 60 ప్రకారం గ్రామపంచాయతీ వర్కర్లకు వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. గ్రామ పంచాయతీ వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి రూ.26 వేల కనీస వేతనం చెల్లించాలని అన్నారు. తాండూరు నియోజకవర్గంలోని గ్రామ పంచాయతీ కార్మికులుజులై 6 నుంచి తలపెట్టిన సమ్మెలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నూతన కమిటి అధ్యక్షుడు అంబరయ్య, కార్యదర్శి శ్రీనివాస్, అనుసూజ, పద్మ, బాలమణి, సంగప్ప, శ్రీనివాస్, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

## 3న గురుపౌర్ణమి ప్రత్యేక పూజలు

**శంకర్‌పల్లి, జూలై 01 ప్రభాతవార్త:**
ఈ నెల 3వ తేదీ సోమవారం గురుపౌర్ణమి సందర్భంగా శంకర్‌పల్లిలోని షిర్డీ సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు షిరిడీ సాయి సేవా సమితి సభ్యులు తెలిపారు. ఆ రోజు ఉదయం 6 గంటలకు కాగడ హారతితో పూజా కార్యక్రమాలు ప్రారంభమవుతాయని తెలిపారు. ఉదయం 6.30 నుంచి 7.30 వరకు సాయిబాబా విగ్రహానికి పంచామృతంతో అభిషేకం, ఉదయం 7.30 నుంచి 9 వరకు అర్చన, అనంతరం అన్నదాన కార్యక్రమం ఉంటుందని తెలిపారు. భక్తులందరు విశేషంగా ఈ కార్యక్రమంలో పాల్గొని బాబా ఆశీస్సులు పొందాలని అన్నారు.

## కీసర సిఐని కలిసిన సర్పంచ్‌లు


కీసర సిఐ వెంకటయ్యను సన్మానిస్తున్న సర్పంచ్ ఆకిటి మహేందర్‌రెడ్డి

**కీసర, జులై1, ప్రభాతవార్తః**
కీసర పోలీస్‌స్టేషన్‌కి నూతనంగా వచ్చిన సిఐ వెంకటయ్యను మండల సర్పంచ్‌లు శనివారం మర్యాదపూర్వకంగా కలిసారు. సర్పంచ్‌లు గోదుమకుంట సర్పంచ్ ఆకిటి మహేందర్‌రెడ్డి, కరీంగూడ సర్పంచ్ కౌకుట్ల గోపాల్‌రెడ్డి, నర్సంపల్లి సర్పంచ్ సనాల సత్తమ్మలు సిఐని శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు గరుగుల మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## హరితహారంలో ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి


హరితహారంలో భాగంగా ఇంటింటికి మొక్కలను పంపిణీ చేస్తున్న సర్పంచ్ ఆకిటి మహేందర్‌రెడ్డి

**కీసర, జులై1, ప్రభాతవార్తః**
హరితహారంలో ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని సర్పంచ్‌లు ఆకిటి మహేందర్‌రెడ్డి అన్నారు. శనివారం గోదుమకుంట గ్రామంలో హరితహారం 9 విడత కార్యక్రమంలో ఇంటింటికి ఆరు మొక్కలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ రాబోయే తరాలు బాగుండాలంటే ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని కోరారు. హరితహారంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సురేష్ రెడ్డి, ఉపసర్పంచ్ సోమని ఆంజనేయులు, ఎంపిటిసి మంచాల కిరణ్‌జ్యోతి, వార్డు సభ్యులు పుట్ట బాలరాజుగౌడ్, సామల ప్రేమ్‌నాథ్‌రెడ్డి, చీర శేఖర్ కురుమ, చీర రజిత శ్రీ మహేష్, తాండూరి సంధ్య దశరథగౌడ్, నాచారం పద్మ యాదగిరిగౌడ్, మంచాల స్వరూప పెంటయ్య, జంగం శివయాదవ్ పాల్గొన్నారు.

## జట్పి చైర్మన్‌ను కలిసిన మండల నాయకులు



**బషీరాబాద్, జూలై 01, ప్రభాతవార్త:**
బషీరాబాద్ మండలానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ నాయకులు శనివారం నాడు వికారాబాద్ జడ్పీ చైర్మన్ సునీత మహేందర్ రెడ్డిని హైదరాబాద్ లోని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. బద్లాపూర్ గ్రామంలో గోనమ్మ దేవాలయం వద్ద నీటి సమస్య ఉందని గతంలో తెలపడంతో రెండు లక్షల రూపాయలు ఆలయ అభివృద్ధికి అందించినట్లు తెలిపారు. ఆలయ అభివృద్ధి పనులు పూర్తి కావటంతో జడ్పీ చైర్ పర్సన్ ను కలిసినట్లు పేర్కొన్నారు. మైల్వార్ గ్రామానికి చెందిన గుండెపల్లి నాగేష్ ఇంట్లో జరగబోయే శుభకార్యానికి ఆహ్వానం అందించినట్లు తెలిపారు. జడ్పీ చైర్మన్ ను కలిసిన వారిలో నరేందర్, నర్సిములు తదితరులు ఉన్నారు.

## వరుణ దేవుడు కరుణించాలని దేవతలకు పూజలు

**బషీరాబాద్, జూలై 01, ప్రభాతవార్త:** వర్షాలు లేక రైతులు, గ్రామస్థులు తమ తమ గ్రామాలలోని గ్రామ దేవతలకు పూజలు నిర్వహించారు. బషీరాబాద్ మండల పరిధిలోని ఎక్మాయి, నీళ్ళపల్లి గ్రామాలలో రైతులు, యువకులు గ్రామ దేవతలకు గంగాభిషేకం చేశారు. సమృద్దిగా వర్షాలు కురవాలని వేపాకు కొమ్మలు కట్టుకొని దప్పుచప్పుళ్ళతో పురవీధుల గుండ తిరిగి అన్ని ఆలయాల్లో పూజలు చేసి గంగాభిషేకం నిర్వహించారు.



# తీసుకున్న రుణాలను సకాలంలో రైతులు చెల్లించాలి

## -పిఎసిఎస్ ఛైర్మన్ సత్యనారాయణ రెడ్డి

**ధారుర్ జూలై1, ప్రభాతవార్త :**
రైతులు తాము తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించాలని పిఎసిఎస్ ఛైర్మన్ సత్యనారాయణ రెడ్డి అన్నారు. ఆయన మాట్లాడుతూ...ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ద్వారా గిరిజన నిరుద్యోగ యువతకు కొత్తగా బ్రాయిలర్ కోళ్ల ఫారం పెట్టడానికి ఇద్దరికి 40 లక్షల దీర్ఘకాలికరణాన్ని ఇచ్చామన్నారు. దీని ద్వారా నిరుద్యోగ యువత వారు ఉపాధి పొందడంతో పాటు కొంతమందికి స్థానికంగానే ఉపాధి కల్పిస్తున్నారని ఆయన తెలిపారు. రైతులకు పంట రుణాలను రూ.22 కోట్లు ఇవ్వడం జరిగిందన్నారు. ఈ రుణాలను రైతులు మార్చి 30లోగా సకాలంలో చెల్లిస్తే ఏడు శాతం వడ్డీ మాత్రమే తీసుకున్న రుణాలపై పడుతుందన్నారు. రైతులు తీసుకున్న రుణాలను రుణమాఫీతో సంబంధ లేకుండా చెల్లించాలన్నారు. దీంతో అపరాధ రుసుము పడకుండా ఉంటుందన్నారు. బంగారు ఆభరణాలపై రుణాలను 15 నిమిషాలలో ఇవ్వడం జరుగుతుందన్నారు. బంగారం నాణ్యత చూసే వ్యక్తి ప్రతిరోజు అందుబాటులో ఉండడం జరుగుతుందన్నారు. ఈ రుణాలపై 80శాతం మాత్రమే వడ్డీ పడుతుందన్నారు. ఈ రుణాలు తీసుకున్న రైతులు సంవత్సరంలోపు రెన్యువల్ చేయాలన్నారు. 4 సంవత్సరాల నుండి బంగారంపై రైతులకు 5 కోట్ల రుణాలను ఇవ్వడం జరిగిందన్నారు. ప్రాథమిక వ్యవసాయ సహకార కేంద్రం ద్వారా రైతులు పంటలకు ఉపయోగించే డిఎపి, యూరియా వంటి కాంప్లెక్స్ ఎరువులను సీజన్‌కు ముందే ధారుర్ సహకారం కేంద్రతో పాటు నాగారం గ్రామంలో అదనం కౌంటర్‌ను ఏర్పాటు చేసి ఎరువులను నిల్వ ఉంచడం జరిగిందన్నారు. దీంతో రైతులు దళారులను ఆశ్రయించి మోస పోకుండా ఎరువులను కొనుగోలు చేస్తున్నారని అన్నారు. రబీ సీజన్లో సహకార సంఘం ద్వారా మం డల పరిధిలో మూడు వరకు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

ధారుర్ మండల కేంద్రంలో సహకార కేంద్రం ద్వారా మొక్కజోన్న కేంద్రాన్ని ఏర్పాటు చేసి 689 క్వింటాళ్లను కొనుగోలు చేయడం జరిగిందన్నారు. రైతులు తాము తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించి సహకార కేంద్రాన్ని ముందంజలో ఉంచాలని వారు మండల రైతు లకు, ఖాతా దారులకు తెలిపారు.

# బిఆర్ఎస్ ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యం : ఎంపిపి శ్రీనివాస్‌రెడ్డి

**కోట్‌పల్లి, జూలై 1, ప్రభాతవార్త :**
బిఆర్ఎస్ ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమని కోట్‌పల్లి ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం నాడు వికారాబాద్ ఎమ్మెల్యే సమక్షంలో కోట్ పల్లి మండల పరిధిలోని మోత్కుపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ మాజీ సర్పంచ్ ఫయాజోద్దీన్, శేఖర్‌గౌడ్, కోట్‌పల్లి మండల వైఎస్ఆర్‌టీపీ అధ్యక్షులు విఠలాచారి వారి అ నుచరులు పార్టీలో చేరారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మెతుకు అనంద్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తూ...వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. అయన మాట్లాడుతూ. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పేదల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టిన ఘనత మన హుక్యమంత్రి కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. రైతుల కోసం రైతుబంధు పథకం వ్యవసాయ ఏరువులు, విత్తనాలకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. రైతుబీమా, రైతు మరణిస్తే రూ.5 లక్షలు బీమా వంటి సౌకర్యం కల్పించడం జరిగిదన్నారు. పేదల పెళ్ళిల కోసం కళ్యాణాలక్ష్మి, షాదిము భారక్, పథకం ఎంతో మందికి మేలు చేకుర్చిందన్నారు. ఇంలాటి పథకాలు చూసి కాంగ్రెస్ ఇతర పార్టీల నుంచి చేరుతున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ గెలిపొందడం ఖాయమని వారు పేర్కొన్నారు, ఈకార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు సుందరి అనిల్, మండల సర్పంచుల సంఘం అధ్యక్షులు వెంకటేష్‌యాదవ్, మండల సహకార సంఘం అధ్యక్షులు రాంచంద్రారెడ్డి, మోత్కుపల్లి సర్పంచు పి.పాండురంగారెడ్డి, వైస్ ఎంపీపీ ఉమాదేవి, మండల వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ దశరథ్‌గౌడ్, కోట్‌పల్లి యూత్ ప్రెసిడెంట్ కొండల్‌రెడ్డి, నాయకులు క్రిష్ణరెడ్డి, నర్సిములు, అశోక్, సామెల్,ఎస్, బందయ్య, తదితరులు పాల్గొన్నారు.


కాంగ్రెస్ పార్టీ నుంచి బీఆర్ఎస్ పార్టీలోకి ఆహ్వానిస్తున్న వికారాబాద్ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్

# తులసిచందుకు ప్రజాసంఘాల సంఘీభావం

## - ర్యాలీ నిర్వహించిన ప్రజాసంఘాల నాయకులు

**షాద్‌నగర్, జూలై 01, (ప్రభాతవార్త) :**
ప్రజల మధ్య విద్వేషాలు సృష్టించి మతం పేరుతో రాజకీయ అధికారం సుస్థిర పరుచుకోవడానికి ప్రయత్నిస్తున్న రాజకీయాలపై వాస్తవాలను ప్రజలకు తెలియజేస్తున్న స్వతంత్ర్య జర్నలిస్టు తులసి చందుపై మత ఉన్మాద మూకలు బెదిరింపులకు పాల్పడటం అప్రజాస్వామికమని ప్రజా సంఘాల నాయకులు తీవ్రంగా కండించారు. శనివారం జర్నలిస్టు తులసి చందుకు మద్దతుగా షాద్‌నగర్‌లో వివిధ ప్రజా సంఘాల నాయకుల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు, ర్యాలీలు, నిరసనలు తెలియజేశారు. పట్టణంలోని స్థానిక ఎంపీడీఓ కార్యాలయం నుంచి పట్టణ ముఖ్యకూడలీ వద్దకు ర్యాలీ నిర్వహించి జర్నలిస్టు తులసిచందుకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా టీఎస్‌యూటీఎఫ్, సీఐటీయూ, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం, ఎస్ఎఫ్ఐ, తెలంగాణ గిరిజన సంఘం, ఏఐఎస్ఎఫ్, జన విజ్ఞానవేదిక తదితర ప్రజాసంఘాల నాయకులు మాట్లాడుతూ... వాస్తవాలు ప్రజలకు వివరించే జర్నలిస్టుపై మత ఉన్మాద మూకలు బెదిరింపులకు దాడులకు పాల్పడటం సిగ్గుచేటని వారు ఖండించారు. మనుషులకు కావాల్సింది కులం, మతం కాదని వారి జీవితాల్లో వెలుగులు నింపాలనే లక్ష్యంతో జర్నలిస్టు తులసి చంద్ పోరాడుతున్నారని వారు కొనియాడారు. దారిద్ర్యం పారదోలే ప్రణాళికలు కావాలని, స్వేచ్ఛగా, నిర్భయంగా నిజాలను ప్రజలకు వివరించడం ఎంతో అవసరమని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటప్ప, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజు, వెంకటరమణ, తిరుమలయ్య, వెంకటయ్య, శివారెడ్డి, నర్సింలుగౌడ్, అర్జునప్ప, సుధాకర్‌రెడ్డి, కుర్మయ్య, రజాక్, నర్సింలు, కృష్ణయ్య, సత్యం, రవికుమార్, రాములు,, శేఖర్‌గౌడ్, కృష్ణ, హనుమంతు, చంద్రశేఖర్, బాలయ్య, శ్రీనునాయక్, అర్జునయ్య పాల్గొన్నారు.


. సంఘీభావం తెలుపుతున్న ప్రజాసంఘాల నాయకులు

# స్పోర్ట్సు స్కూల్స్‌లో ప్రవేశాలకు 3,4తేదీల్లో ఎంపికలు : ఎంఇఓ

**శామీర్‌పేట, జూలై 1, ప్రభాతవార్త**
శామీర్‌పేట ఉమ్మడి మండలంలోని విద్యార్థులకు తెలంగాణ స్పోర్ట్సు స్కూల్‌లో ప్రవేశాల కోసం మండల స్థాయిలో ఎంపికకు శామీర్‌పేట మినీస్టేడియంలో ఈ నెల 3,4తేదీల్లో ఎంపికలు చేయనున్నట్లు శామీర్‌పేట ఎంఇఓ వసంతకుమారి పేర్కొన్నారు. శామీర్‌పేట మినీస్టేడియంలో ఈ నెల 3వ తేదీన 4వతరగతికి, 4వ తేదీన 5వ తరగతికి విద్యార్థుల ఎంపికలు మండల స్థాయిలో జరుగుతాయని ఆమె వివరించారు. 4వ తరగతికి ప్రవేశానికి సంబంధించి 8నుంచి 9సంవత్సరాలు 1సెప్టెంబరు2014నుంచి 31ఆగస్టు2015మధ్యకాలంలో జన్మించి ఉండాలని వివరించారు. 5వ తరగతికి సంబంధించి 10సంవత్సరాలలోపు ఉండాలని, 1సెప్టెంబరు2013నుంచి 31ఆగస్టు2014లోపు జన్మించి ఉండాలన్నారు. శామీర్‌పేట మినీస్టేడియంలో 3,4 తేదీలలో ఉదయం 9గంటలలోపు హాజరుకావాల్సి ఉంటుందన్నారు. పుట్టిన తేది ధృవపత్రం, తహసీల్దార్, మున్సిపాల్టీ, పంచాయతీ నుంచి పొంది ఉండాలన్నారు. బోనాఫైడ్ సర్టిఫికెట్ ప్రస్తుతం చదివే పాఠశాల నుంచి పొందాలని, 10పాస్‌ఫోటోలు కావాలని ఆమె తెలిపారు. ఇతర వివరాలకు 9849416773, 9490148731నెంబర్లలో సంప్రదించాలని ఎంఇఓ వసంతకుమారి పేర్కొన్నారు.

# దేవాలయ అభివృద్ధికి సహకారిస్తా

## - మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి

**షాద్‌నగర్, జూలై 01, (ప్రభాతవార్త) :** షాద్‌నగర్ పట్టణంలోని ఈశ్వర్ కాలనీలో నూతనంగా నిర్మిస్తున్న అమ్మవారి ఆలయ అభివృద్ధికి తన వంతు సహాయసహకారాలు అందజేస్తామని మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి అన్నారు. శనివారం షాద్‌నగర్ పట్టణ పరిధిలోని 7వ వార్డులో ఉన్న శ్రీ ఈశ్వర అభయాంజనేయ స్వామి దేవాలయంలో అమ్మవారి ఆలయ నిర్మాణం సందర్భంగా మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి దేవాలయాన్ని సందర్శించి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ వార్డు కౌన్సిలర్ ఈశ్వర్ రాజు, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, వార్డు పెద్దలు మాజీ ఎమ్మెల్యేను శాలువతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రతి ఒక్కరికి దైవ చింతన ఎంతో అవసమని, దైవ చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని ఆయన అన్నారు. ఆలయ అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు ఎప్పుడు ఉంటాయని వారికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో శేఖర్‌గౌడ్, పెంటయ్య, పడకంటి శ్రీశైలం, వెంకట్‌రెడ్డి, రాజు, దర్శన్, మధు, నర్సింలు, డిజిటల్ మల్లేష్, ఆర్య నాయక్, భాస్కర్, విజయ్, కార్తీక్, ప్రణయ్, హరీష్, శివ, శ్రీశైలం, విష్ణువర్ధన్‌రెడ్డి, మధు, కాంతయ్య రమేష్ తదితరులు పాల్గొన్నారు.


మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డిని సన్మానిస్తున్న ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు తదితరులు

# ఇంటింటికి బిజెపి కార్యక్రమం


ఇంటింటికి బిజెపి కార్యక్రమం నిర్వహిస్తున్న నాయకులు.

**బొంరాస్‌పేట్, జూలై1, ప్రభాతవార్త ః**
ఇంటింటికి బిజెపి కార్యక్రమంను బిజెపి ఇంచార్జ్ సెల్వజీ, జిల్లా నాయకులు బాబయ్యానాయుడు బొంరాస్‌పేట్ మండల కేంద్రంలో మండల అధ్యక్షులు నర్సిములు అధ్వర్యంలో మహజన్ సంపర్క్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో కేంద్రప్రభుత్వం తొమ్మిదిసంవత్సరాలలో చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ఇంటింటికి బిజెపి కార్యక్రమం ద్వార వివరించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో తాలుక ఐటీ సోషల్ మీడియా కన్వీనర్ ముకుంద, జిల్లా నాయకులు నాగురావు, బూత్ అధ్యక్షులు మల్లేషం తదితరులు పాల్గొన్నారు.

## ఖమ్మం సభకు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు కదలాలి

**కొత్తూర్, జూలై 1, ప్రభాతవార్త :**
ఆదివారం ఖమ్మంలో జరగబోయే కాంగ్రెస్ పార్టీ భారీ బహిరంగ సభకు రాహుల్ గాంధీ పాల్గొనున్నారు. కాంగ్రెస్ పార్టీ సభకు ప్రజలు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు సైనికుల్లా స్వచ ్ఛందంగా పెద్ద ఎత్తున్న కదలిరావాలని కాం గ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కౌన్సిలర్ వీరమోని హేమదేవేందర్ ముదిరాజ్ పిలుపునిచ్చారు. రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వామని, ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేసే సమయం ఆసన్నమైందన్నారు. పెద్ద ఎత్తున్న జరుగుతున్న ఖమ్మం సభకు రాహుల్‌గాంధీతో పాటు టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి తదితర ప్రముఖులు హాజరుకానున్నారని, ఈసందర్భంగా కొత్తూర్ పురపాలకతో పాటు మండలం నుండి స్వచ ్ఛందంగా కార్యకర్తలు, ప్రజలు తరలిరావాలని పిలుపునిచ్చారు.

## సాయిచంద్ మృతి తీరని లోటు : ఎమ్మెల్యే పట్నం


సాయిచంద్ చిత్రపటానికి నివాళ్లు అర్పిస్తున్న ఎమ్మెల్యే తదితరులు

**కొడంగల్ రూరల్, జులై 1 (ప్రభాతవార్త) ః**
గిడ్డంగుల సంస్థ రాష్ట్ర చైర్మన్, గాయకుడు సాయిచంద్ మృతి తీరని లోటని ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి అన్నారు. శనివారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సాయిచంద్ చిత్రపటానికి ఆయన పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. తెలంగాణ ఉద్యమ సమయంలో తన ఆటాపాటతో ప్రజలను ఉద్యమం వైపు నడిపించారన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ మధుసూదన్ యాదవ్, కోట్ల మహిపాల్, సయ్యద్ అంజద్, మాజీ సర్పంచ్ రమేశ్‌బాబు, తుప్పలి అశోక్, ప్రమోద్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణి విశ్రాంత ఉద్యోగులకు వైద్య సౌకర్యం కల్పించాలి


వెంకటాపూర్ నీలిమ ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేస్తున్న సింగరేణి రిటైర్ట్ ఉద్యోగుల సంఘ నాయకులు

**ఘట్‌కేసర్, జూలై 1, ప్రభాతవార్త:**
సింగరేణి విశ్రాంత ఉద్యోగులకు వెంకటాపూర్‌లోని నీలిమ ఆసుపత్రిలో వైద్య సౌకర్యం కలి ్పంచాలని ఆసంఘ నాయకులు శనివారం ఆసుప త్రి మెడికల్ సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేశారు. మేడ్చల్ జిల్లాలో దాదాపు 500 మంది సింగరేణి విశ్రాంత ఉద్యోగులు నివాసం ఉంటున్నారని తెలిపారు. సింగరేణి యాజమాన్యం ఇచ్చిన సీపీఆర్ ఎంఎస్ మెడికల్‌కార్డును వినియోగించాలంటే హైదరాబాద్ నగరంలోని సింగరేణి ఒప్పంద ఆసుపత్రులు దూరంగా ఉండటంతో అత్యవసర సమయాల్లో చేరుకోలేక ప్రాణాపాయస్థితి ఏర్పడుతుందన్నారు. అతితక్కువ పెన్షన్ పొందుతున్న విశ్రాంత ఉద్యోగులకు రవాణా ఖర్చులతో పాటు సమయానుకూలత లేక పోతుందని వారు తెలిపారు. ఘట్‌కేసర్ పరసర ప్రాంతాల్లో నివసిస్తున్న సింగరేణి విశ్రాంత ఉద్యోగులకు జోడిమెట్ల సమీపంలో ఉన్న నీలిమ ఆసుపత్రిలో మెడికల్ కార్డు ద్వారా వైద్య సౌకర్యం కల్పించాలని సింగరేణి (పా), సింగరేణి చీఫ్ మెడికల్ ఆఫీసర్‌కు పోస్టు ద్వారా వినతిపత్రం పంపించినట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు ఆళవందార్ వేణుమాధవ్, నాయకులు బంగారి రాజయ్య, బంగారి మల్లయ్య, నర్సయ్య, ప్రతాప్‌సింగ్, రఫీక్ తదితరులు పాల్గొన్నారు.

## మొక్కలు నాటుదాం పర్యావరణాన్ని కాపాడుదాం


సర్పంచ్ లక్ష్మినరసింహారెడ్డితో కలిసి మొక్కలు నాటుతున్న సంజీవల్ల రాఘవ

**కడ్తాల్, జులై 01 ప్రభాతవార్త**
మొక్కలు నాటడం వలన మానవ మనుగడకు ఎన్నో ఉపయోగాలు ఉన్నాయని గ్రీన్ ఇండియా ఛాలెంజ్ కో ఫౌండర్ సంజీవల్ల రాఘవ అన్నారు. శనివారం కడ్తాల్ మండల కేంద్రంలోని పల్లె ప్రకృతి వనాన్ని స్థానిక సర్పంచ్ గూడూరు లక్ష్మినరసింహారెడ్డితో కలిసి సందర్శించి మొక్కలు నాటారు. తెలంగాణ వ్యాప్తంగా దేశంలో, ఏ రాష్ట్రంలో లేనివిధంగా మొక్కలు నాటుతున్నారని తద్వారా 24 శాతం ఆవరించి ఉన్న పచ్చదనం 33 శాతం పెరిగిందని, ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటి సంరక్షించాలని కోరారు. ఈ సందర్భంగా సర్పంచ్, పాలక వర్గానికి మొక్కలు నాటడం, సంరక్షిస్తున్న విధానం పట్ల శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు అశోక్, నాయకులు భాస్కర్, వెంకటేష్ పాల్గొన్నారు.

## డాక్టర్ వృతి దైవంతో సమానం: కౌన్సిలర్ రాజశేఖర్

**ఘట్‌కేసర్ రూరల్, జూలై 1, ప్రభాతవార్త:** డాక్టర్ వృతి దైవ సమానమని పోచారం మున్సిపల్ 3 వ వార్డు కౌన్సిలర్ చింతల రాజశేఖర్ అన్నారు. అంతర్జాతీయ డాక్టర్స్ డే సందర్భంగా అన్నోజిగూడ బస్తీ దవాఖానలో డాక్టర్‌గా పనిచేస్తున్న సుధేష్ణను కౌన్సిలర్ రాజశేఖర్ శాలువా కప్పి సత్కరించారు. డాక్టర్ల వృతి ఎంతో గొప్పదని మనిషి ప్రాణాలను కాపాడే శక్తి ఒక్క డాక్టర్‌కే ఉందని అన్నారు. కరోనా కష్టకాలంలో డాక్టర్లు తమ ప్రాణాలను అడ్డుపెట్టి బాధితుల ప్రాణాలు కాపాడారని అన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్‌తో పాటు స్థానికులు లోకేశ్ నాయక్, కదం రాజు తదితరులు పాల్గొన్నారు.


అంతర్జాతీయ డాక్టర్స్ డే సందర్భంగా అన్నోజిగూడలో డాక్టర్‌కు శాలువాకప్పి సత్కరిస్తున్న కౌన్సిలర్ చింతల రాజశేఖర్